# సిమెంట్ ధరలకు రెక్కలు?

**ఈ ఆర్థిక సంవత్సరం 4 శాతం వరకు విజృంభించనున్న రేట్లు**

**మార్కెట్‌లో 7.5 శాతం మేరకు పెరగనున్న డిమాండ్: క్రిసిల్ అంచనా**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) దేశీయ మార్కెట్‌లో సిమెంట్ ధరలు 2 నుంచి 4 శాతం (రూ.15-20) మేరకు పెరిగే వీలున్నట్టు ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ, విశ్లేషణ సంస్థ క్రిసిల్ ఓ తాజా రిపోర్టులో అంచనా వేసింది. అలాగే డిమాండ్ 6.5 శాతం నుంచి 7.5 శాతం వరకు పెరగవచ్చని కూడా అన్నది. ప్రధాన మౌలిక వసతుల కల్పనకు, గ్రామీణ హౌజింగ్ ప్రాజెక్టులకు ఈసారి బడ్జెట్‌లో 10 శాతం దాకా కేటాయింపులు పెరగడం, రాబోయే వర్షాకాలంలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు అవుతుందన్న అంచనాలు సిమెంట్ వినియోగాన్ని, పరిశ్రమను ఉత్సాహపరుస్తున్నాయని పేర్కొన్నది. వ్యవసాయం లాభసాటిగా మారితే గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణాలు ఊపందుకుంటాయని కూడా క్రిసిల్ ఇంటిలిజెన్స్ అసోసియేట్ డైరెక్టర్ సచిదానంద్ చౌబే చెప్తున్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2024-25) సిమెంట్ ఇండస్ట్రీలో వృద్ధిరేటు 4.5-5.5 శాతంగానే ఉన్నది. అయితే లోక్‌సభ ఎన్నికలు, అంతకుముందు మూడు ఆర్థిక సంవత్సరాల్లో అధిక వృద్ధిరేట్లే ఇందుకు కారణమని చెప్తున్నారు.

**మౌలికమే దన్ను**

రోడ్ల నిర్మాణాలు ఈ ఆర్థిక సంవత్సరం పెద్ద ఎత్తున జరిగే వీలుండటం సిమెంట్ వినియోగపు అంచనాల్ని అమాంతం పెంచేస్తున్నాయని క్రిసిల్ అంటున్నది. రైల్వేలు, సాగునీటి ప్రాజెక్టులు, పట్టణ మౌలిక సదుపాయాల కల్పన కూడా జోరుగా జరుగవచ్చన్న అంచనాలున్నాయి. ఈ క్రమంలోనే సిమెంట్‌కు గిరాకీ బాగా పెరగవచ్చని క్రిసిల్ అంచనా వేస్తున్నది. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై), మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్ఈజీఏ) వంటి పథకాలు సైతం సిమెంట్ ఇండస్ట్రీకి దన్నునిస్తున్నట్టు పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. మొత్తానికి కేంద్ర ప్రభుత్వ పథకాలు, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండే ఈసారి సిమెంట్ పరిశ్రమ ఆదాయానికి కీలకంగా మారనున్నాయి.

**పట్టణ డిమాండ్ అంతంతే**

దేశంలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల్లో నిర్మాణ రంగం నిరాశాజనకంగా ఉండటం సిమెంట్ పరిశ్రమకు ఎదురుదెబ్బగానే విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. గృహ రుణాలపై వడ్డీరేట్లు ఆశించిన స్థాయిలో తగ్గకపోవడం కొనుగోలుదారులను నిరుత్సాహపరుస్తున్నదని చెప్తున్నారు. ఇప్పటికే పెరిగిన నిర్మాణ వ్యయం కూడా కస్టమర్లను వేచిచూసే ధోరణిలోకి నెడుతున్నదని, దీంతో ఇప్పటికే నిర్మించిన ఇండ్లు అమ్ముడుపోక, కొత్త ప్రాజెక్టులపై రియల్టర్లు పెద్దగా ఆసక్తి చూపట్లేదన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో ఇండ్ల అమ్మకాలు పడిపోవడం, మార్కెట్‌లో స్తబ్ధత నెలకొనడం పరిశ్రమకు ప్రతికూలమని అభిప్రాయపడుతున్నారు. అయితే హైదరాబాద్‌సహా ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు పుంజుకొంటే సిమెంట్ ధరలు ఇంకా పెరిగే వీలుందన్న అంచనాలూ ఉన్నాయి.

# లక్ష రూపాయలు దాటిన పుత్తడి

**మరో రూ.1,800 పెరిగిన తులం ధర**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: బంగారం ధరలు భగభగమండుతున్నాయి. తొలిసారిగా లక్ష రూపాయల మైలురాయిని అధిగమించి రికార్డు నెలకొల్పింది పుత్తడి. దేశీయ రాజధానిలో పదిగ్రాముల బంగారం ధర రూ.1,800 ఎగబాకి లక్ష రూపాయల పైకి చేరుకున్నది. ప్రాంతీయ ఆభరణాల వర్తకులు, స్టాకిస్టులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతోపాటు వచ్చేవారంలో అక్షయ తృతీయ, ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్ కావడంతో డిమాండ్ అధికంగా ఉంటుందన్న అంచనాతో ధరలు భారీగా పెరుగుతున్నాయి. ట్రేడ్ వార్‌తో ప్రపంచ దేశాల ఆర్థికంపై అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం కూడా ధరలు పెరగడానికి ప్రధాన కారణం. దీంతో ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,01,600కి చేరుకున్నది. సోమవారం ఇది రూ.99,800గా ఉన్నది. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు బంగారం ధర రూ.22,650 లేదా 29 శాతం ఎగబాకింది. మరోవైపు, వెండి ధరలు నిలకడగా రూ.98,500 వద్ద స్థిరంగా ఉన్నాయి. అలాగే హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం గోల్డ్ ధర రూ.3,000 ఎగబాకి రూ.1,01,350కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.98,350గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర రూ.2,750 అందుకొని రూ.92,900 పలికింది. కిలో వెండి రూ.1,11,000గా నమోదైంది.



**అక్షయ తృతీయకు డిమాండ్ అంతంతే**

రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలతో సామాన్యుడితోపాటు సంపన్నవర్గాలు కొనుగోలు చేయడానికి జంకుతున్నారు. ఈనెల 30న అక్షల తృతీయ సందర్భంగా కొనుగోళ్లు భారీగా తగ్గే అవకాశాలున్నాయని బులియన్ వర్తకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

**బంగారం ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు**

- టారిఫ్‌ల విషయంలో అమెరికా ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా చర్యలు తీసుకుంటుండటం
- వడ్డీరేట్ల తగ్గింపుపై ఫెడరల్ రిజర్వు చీఫ్ జెరోమ్ పోవెల్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య వివాదం నెలకొనడం
- చైనాతోపాటు ప్రపంచవ్యాప్తంగా కేంద్రబ్యాంకులు బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేయడం
- అమెరికా కరెన్సీ డాలర్ బలహీనపడటం

# ఆరో రోజూ లాభాల్లో సూచీలు

ముంబై, ఏప్రిల్ 22: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఆరో రోజూ లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లకు లభించిన మద్దతుతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా పెట్టుబడులు పెట్టడం సూచీల్లో జోష్ పెంచింది. ఇంట్రాడేలో 400 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 187.09 పాయింట్లు అందుకొని 79,595.59 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 41.70 పాయింట్లు ఎగబాకి 24,167.25 వద్ద స్థిరపడింది. భారీగా లాభపడ్డ సూచీలకు ఐటీ, ఎనర్జీ రంగ షేర్లు బ్రేక్‌లు వేశాయని, అయినప్పటికీ రియల్టీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ రంగ సూచీలు ఇచ్చిన దన్నుతో లాభాల్లో ముగిశాయి. ఐటీసీ, హెచ్‌యూఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్‌ల షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..మరోవైపు ఇండస్ ఇండ్ బ్యాంక్ 4.88 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు పవర్‌గ్రిడ్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ 2.40 శాతం లాభపడగా, ఎఫ్ఎంసీజీ 1.87 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.43 శాతం, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ రంగ సూచీలు లాభపడగా..టెక్నాలజీ, ఐటీ, పవర్, యుటిలిటీస్, టెలికం రంగ షేర్లు నష్టపోయాయి.

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రికార్డు**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నది. మంగళవారం సంస్థ షేరు 2 శాతం లాభపడటంతో బ్యాంక్ మార్కెట్ విలువ రూ.15 లక్షల కోట్లు దాటింది. ఈ మైలురాయికి చేరుకున్న మూడో సంస్థ కూడా హెచ్‌డీఎఫ్‌సీ కావడం విశేషం. గడిచిన పదిహేను రోజుల్లో బ్యాంక్ షేరు 11 శాతం లాభపడటంతో మార్కెట్ క్యాప్ రూ.1,50,289.64 కోట్లు పెరిగి రూ.15,01,289.37 కోట్లుగా నమోదైంది.

# సత్తా చాటిన తెలంగాణ తేజాలు

- సాయి శివానీకి 11వ ర్యాంకు
- కానిస్టేబుల్ కుమారుడికి 68వ ర్యాంకు
- టాప్-10లో తెలంగాణకు దక్కని చోటు
- 100లో 13 మంది తెలుగు విద్యార్థులు
- తెలుగు రాష్ర్టాల నుంచి 78 మంది ఎంపిక
- 1,009 మంది ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) వెలువరించిన సివిల్స్-2024 తుది ఫలితాల్లో తెలంగాణకు ర్యాంకుల పంట పండింది. రాష్ర్టానికి చెందిన ఎట్టబోయిన సాయిశివాని 11వ ర్యాంకు సాధించింది. వరంగల్‌కు చెందిన రావుల జయసింహారెడ్డి 46వ ర్యాంకు, హైదరాబాద్‌కు చెందిన చింతకింది శ్రావణ్‌కుమార్‌రెడ్డి 62వ ర్యాంకు, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సాయి చైతన్యజాదవ్ 68వ ర్యాంకుతో అదరగొట్టారు. అయితే టాప్-10లో ఒక్కరు కూడా తెలంగాణకు చెందిన వారు లేరు. ఈ సారి మొత్తం గా 1,009 మంది ఫలితాలను యూపీఎస్సీ విడుదల చేయగా, క్యాటగిరీవారీగా తీసుకుంటే జనరల్ 335, ఈడబ్ల్యూఎస్ 109, ఓబీసీ 318, ఎస్సీ 160, ఎస్టీ 87 క్యాటగిరీ అభ్యర్థులున్నారు. ఈ సారి తెలంగాణ, ఏపీ నుంచి సివి ల్ సర్వీసెస్‌కు ఎంపికైన వారి సంఖ్య పెరిగింది.



సాయిశివాని



జయసింహారెడ్డి

రెండు రాష్ర్టాల నుంచి 78 మంది ఎంపికైనట్టు లా ఎక్స్‌లెన్స్ డైరెక్టర్ రాంబాబు పాలడుగు అంచనావేశారు. టాప్-100లో 13 మంది తెలుగు విద్యార్థులున్నట్టు విశ్లేషించారు.

**కోచింగ్ తీసుకోకుండా 11వ ర్యాంకు**

వరంగల్ శివనగర్‌కు చెందిన సాయిశివాని కోచింగ్ తీసుకోకుండానే, సొంత ప్రిపరేషన్‌లో, నిపుణుల మార్గదర్శనంలో ఏకంగా ఆలిండియా 11వ ర్యాంకు సాధించడం గమనార్హం.

**కానిస్టేబుల్ కొడుకు.. కలెక్టర్ కాబోతున్నడు**

నాన్న కానిస్టేబుల్. అమ్మ టీచర్. సివిల్స్ ప్రయత్నంలో ఐదు సార్లు విఫలమయ్యాడు. అయినా ఎక్కడా ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. క్రమపద్ధతిలో హార్డ్‌వర్క్‌చేసి సక్సెస్ సాధించాడు సాయిచైతన్య జాదవ్. తల్లిదండ్రులిచ్చిన ప్రోత్సాహం మరువలేనిదని, 68వ ర్యాంకు వస్తుందని ఊహించలేదని సాయిచైతన్య తెలిపాడు. హనుమకొండకు చెందిన రావుల జయసింహారెడ్డి స్టేట్ రెండో టాపర్(46వ ర్యాంక్)గా నిలిచాడు. నల్లమలకు చెందిన దళిత యువకుడు మొదటిసారే సత్తా చాటాడు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్ వాసి సాయికిరణ్ 298వ ర్యాంక్ సాధించాడు. హనుమకొండలోని బాలసముద్రంకు చెందిన హరిప్రసాద్ 255వ ర్యాంక్ సాధించాడు.

| పేరు | ర్యాంకు |
|---|---|
| ఎట్టబోయిన సాయి శివానీ | 11 |
| రావుల జయసింహారెడ్డి | 46 |
| చింతకింది శ్రావణ్ కుమార్‌రెడ్డి | 62 |
| సాయిచైతన్య జాదవ్ | 68 |
| కొలిపాక శ్రీకృష్ణ సాయి | 190 |
| కౌశిక్ నర్సింహ | 225 |
| పోతరాజు హరిప్రసాద్ | 255 |
| సాయికిరణ్ | 298 |
| రాపర్తి ప్రీతి | 451 |
| బానోతు నాగరాజు నాయక్ | 697 |
| తొగరపు సూర్యతేజ | 799 |
| గోకమల్ల ఆంజనేయులు | 934 |
| రామటెంకి సుధాకర్ | 949 |

# సివిల్స్ ఫలితాల్లో నారీశక్తి

- యూపీకి చెందిన శక్తి దూబేకు ఫస్ట్ ర్యాంకు
- టాప్-5లో ముగ్గురు మహిళలు
- టాప్-20లో ఏకంగా 11 మంది
- ఫలితాలు ప్రకటించిన యూపీఎస్సీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్- 2024 ఫలితాల్లో నారీశక్తి ప్రతిబింబించింది. టాప్-5లో ముగ్గురు యువతులు ఉండగా, టాప్-20లో ఏకంగా 11 మంది చోటు దక్కించుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన శక్తి దూబేను మొదటి ర్యాంకు వరించిం ది. హర్షితా గోయల్‌కు రెండో ర్యాంకు, షా మార్గి చిరాగ్ నాలుగో ర్యాంకు దక్కించుకున్నారు. డోంగ్రే అర్చిత్ పరాగ్‌కు మూడో ర్యాంకు, ఆకాశ్ గార్గ్‌కు ఐదో ర్యాంకు లభించినట్టు యూపీఎస్సీ మంగళవారం ప్రకటించింది. ప్రథమ ర్యాంకర్ శక్తి దూబే యూపీలోని అలహాబాద్ యూనివర్సిటీ నుంచి బయోకెమిస్ట్రీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ పొందారు. రెండవ ర్యాంకు సాధించిన హర్షితా గోయల్ ఎంఎస్ యూనివర్సిటీ ఆఫ్ బరోడా నుంచి బీకాం పట్టభద్రురాలు. మూడో ర్యాంకు సాధించిన డోంగ్రే అర్చిత్ పరాగ్ తమిళనాడులోని వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్) నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పట్టభద్రుడు. నాలుగో ర్యాంకు సాధించిన షా మార్గి చిరాగ్ అహ్మదాబాద్‌లోని గుజరాత్ టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో బీఈ పట్టా పొందారు.



కేటీకే-5వ గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

## కేటీకే-5వ గని మేనేజర్‌కు టీబీజీకేఎస్ నేతల వినతి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 22 : సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 ఇంక్లైన్ గని మేనేజర్ జాకీర్ హుస్సేన్‌కు తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఫిట్ సెక్రటరీ నరేశ్‌నేత ఆధ్వర్యంలో టీబీజీకేఎస్ నాయకులు మంగళవారం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నరేశ్‌నేత మాట్లాడుతూ సింగరేణి సంస్థ పరిరక్షణకు నూతన బొగ్గు గనుల కేటాయింపు, సంక్షేమ చర్యలను విస్తృత పర్చడంతో పాటు కార్మికులకు సంబంధించిన పలు సమస్యలను తీర్చాలని కోరినట్లు చెప్పారు. సమస్యలు తీర్చకుంటే దశలవారీగా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఈనెల 25న ఏరియా జీఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, మళ్లీ వినతి పత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవరకొండ మధు, బ్రాంచి కార్యదర్శి సాంబయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురయ్య, కిరణ్, నాయకులు రమణారెడ్డి, రిలేబీ షిఫ్టు ఇన్‌చార్జి రాజయ్య, హరికృష్ణ, ఎస్టీ కన్వీనర్ రవి, కో కన్వీనర్ బాలాజీ పాల్గొన్నారు.

## మే 20న సార్వత్రిక సమ్మె

ఏటూరునాగారం, ఏప్రిల్ 21 : వచ్చే నెల 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో అనుబంధ సంఘాల సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోని వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. 29కార్మిక చట్టాలను ఏకపక్షంగా రద్దు చేసిందన్నారు. కార్మికుల సమ్మె హక్కును కేంద్రం ప్రశ్నార్థకం చేసిందన్నారు. స్కీం వర్కర్స్ సమస్యలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను గాలికొదిలేసి మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు మాత్రం రూ.16.35లక్షల కోట్లు మాఫీ చేసిందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే సదస్సుకు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, టీఆర్ఎస్‌కేవీ లాంటి జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సమ్మెలో కార్మిలకు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘాల నాయకులు తోట మల్లికార్జున్, దావూద్, రత్నం రాజేందర్, సద్దాం హుస్సేన్, మహేశ్, పాప, రంజిత్, భిక్షపతి, ఈశ్వరీ, రాంబాయి, సూరమ్మ, రుక్మిణి, ఆదిలక్ష్మీ, కాంత, కొంరయ్య, రాంబాబు, సర్వర్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మాధవి

# సాయి హత్యలో సొంత పిన్ని హస్తం

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తుండడమే కారణం
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్‌సింగ్
- ప్రధాన నిందితుడు కానిస్టేబుల్, మరో ఐదుగురి అరెస్ట్
- నిందితుల నుంచి కారు, రెండు ఆటోలు, రెండు బైక్‌లు, ఎయిర్ పిస్తోల్ స్వాధీనం



సాయిప్రకాశ్ హత్య నిందితులను అరెస్ట్ చూపిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

సుబేదారి, ఏప్రిల్ 22 : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని సొంత పిన్నే యువకుడి దారుణ హత్యలో పాలుపంచుంది. ప్రధాన నిందిడు కానిస్టేబుల్, మరో ఐదుగురు నిందితులు హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం పోలీ స్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ నిందితులను అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు)కు చెందిన చిడెం సాయి ప్రకాశ్ ఈనెల 15న హనుమకొండలో అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు హ నుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు టె క్నాలజీతో అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. నిందితుల్లో ఒకరైన డేవిలి సాయిని హనుమకొండ బస్‌స్టేషన్‌లో అదుపులో తీసుకొని విచారించగా, ఆ సమాచారం మేరకు మిగతా నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో 2009లో హైదారాబాద్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికైన ప్రధాన నిందితుడు హనుమకొండ చింతగట్టుకు చెందిన బాషబోయిన శ్రీనివాస్ పరస్పర బదిలీల్లో భాగంగా హనుమకొండ బదిలీ అయ్యాడు. 317 జీవో ద్వారా వెంకటాపురం (నూగూరు)కు బదిలీ అయ్యాడు. అక్కడ మృతుడు సాయి ప్రకాశ్ పిన్ని (బాబాయ్ భార్య)తో కానిస్టేబుల్ శ్రీనివాస్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంలో సాయి ప్రకాశ్, అతడి బాబాయ్ ఇద్దరు ములుగు పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కానిస్టేబుల్ శ్రీనివాస్‌పై విచారణ చేపట్టి సస్పెండ్ చేశారు. దీనిపై అతడు కక్షగా పెట్టుకున్నాడు.

**సొంత పిన్ని సమాచారంతోనే..**

ఈనెల 15న సాయి ప్రకాశ్, బాబాయ్, పిన్ని నిర్మల కలిసి కారులో హనుమకొండకు దవాఖానకు వచ్చారు. ఈ విషయం నిర్మల కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. వెంటనే శ్రీనివాస్ మరో నలుగురు నిందితులు గుంటూరు జిల్లాకు చెందిన డేవిలి సాయి, హనుమకొండకు చెందిన ఆలోతు అరుణ్‌కుమార్, సబావత్ అఖిల్ నాయక్, రాజు ఈనెల 15న అర్ధరాత్రి సాయి ప్రకాశ్ కారును ఆటోలో వెంబడించారు. హనుమకొండ గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డు బేబి సైనిక్ స్కూల్ వద్ద కారును అడ్డగించి అదే కారులో సాయి ప్రకాశ్‌ను ఎక్కించుకొని హసన్‌పర్తి శివారులో తీవ్రంగా కొట్టి, శాలువాతో గొంతును బిగించి హత్య చేశారు. ఆ తర్వాత హుస్నాబాద్ సమీపంలోని జిల్లేడు గడ్డ తండా శివారు బావిలో మృతదేహాన్ని పడేశారు. నిందితులను అరెస్ట్ చేసి, కారు, రెండు ఆటోలు, రెండు బైక్‌లు, ఎయిర్ పిస్తోల్ ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు. ఈ కేసు లో ప్రతిభ చూపిన హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్, సిబ్బందిని సీపీ అభినందించారు.



పురుగుల మందు డబ్బాతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

## పురుగుల మందు డబ్బాతో రైతుల నిరసన

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 22 : జెన్‌కో కన్వేర్ బెల్ట్ సర్వే పనులను అడ్డుకొని భూపాలపల్లి మండలం కొంపెల్లి అమ్లెట్ గ్రామమైన సిపెల్లి రైతులు మంగళవారం పురుగుల మందు డబ్బాతో రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిచర్ల నుంచి జెన్‌కో వరకు వేస్తున్న కన్వేర్ బెల్ట్ తమ గ్రామంలో ఉన్న 250 ఎకరాల భూమి నుంచి వెళ్తున్నదని, కేవలం సర్వే అధికారులు 2 ఎకరాల 20 గుంటల భూమిని మాత్రమే తీసుకొని ఒక ఎకరానికి రూ.16.50 లక్షల పరిహారం చెల్లించి తీసుకుంటున్నారని తెలిపారు. కన్వేర్ బెల్ట్ వేస్తే వాతావరణ పొల్యూషన్ జరిగి పంటలు పండకుండా నష్టపోతామని, పూర్తిగా భూములు తీసుకొని నష్టపరిహారం చెల్లించాలని జెన్‌కో, రెవెన్యూ అధికారులను వారు కోరారు. లేకపోతే పనులను అడ్డుకుంటామని రైతులు హెచ్చరించారు.

## పౌష్టికాహారంతోనే చక్కటి ఆరోగ్యం

మహాముత్తారం, ఏప్రిల్ 22 : పౌష్టికాహారంతోనే చక్కటి ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రేమ్‌నగర్ లో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించగా ఆమె హాజరై మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణుల్లో రక్తహీనతను నివారించవచ్చన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సులోచన, ఉపాధ్యాయులు వాంకుడోత్ శ్రీనివాస్, ఆశ వర్కర్ సుజాత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ ప్రమీల, అంగన్‌వాడీ టీచర్ జాటోత్ చరణ్‌బాయ్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న గర్భిణులు, అధికారులు

## సింగరేణిలో మెరిట్ స్కాలర్ షిప్‌పెంపు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 22 : సింగరేణిలో మెరిట్ స్కాలర్ షిప్ రూ.10 వేల నుంచి రూ.16వేలకు పెంచుతూ మంగళవారం సింగరేణి డైరెక్టర్ పా ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏరియా అధికార ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్, ఎయిమ్స్ తదితర కోర్సుల ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన సింగరేణి కార్మికుల, అధికారుల పిల్లలకు ఇప్పటి వరకు ఇస్తున్న వార్షిక స్కాలర్ షిప్ మొత్తాన్ని రూ.16వేలకు పెంచింది. కనీస ర్యాంకు 2వేల లోపు నుంచి 8వేల లోపు ఉండాలని సూచించారు. ఈ ఉత్తర్వులు 2024-25 విద్యాసంవత్సరంలోని ప్రవేశ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు వర్తింస్తుందన్నారు. ఈ మేరకు అన్ని ఏరియాల నుంచి జూన్ 15లోపు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

## డాక్టర్లు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 22 : వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వంద పడకల ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బానోత్ జానమ్మ కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ బాసింగ్‌పల్లి గ్రామానికి చెందిన తమ అత్త అజ్మీరా కళమ్మ ప్రమాదవశాత్తు కింద పడగా కాలు విరిగిందన్నారు. వెంటనే 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని వంద పడకల దవాఖానకు తీసుకురాగా ఆమెను కిందకు దించేందుకు సిబ్బంది ఎవరూ రాకపోవడంతో తమ వదినతో కలిసి స్ట్రక్చర్‌పై ఎమర్జెన్సీ వార్డుకు తీసుకెళ్లామని తెలిపారు. డ్యూటీలో ఉన్న నర్సులు సైతం గంటన్నర అయినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యసేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆమె ఉన్నతాధికారులను కోరారు.



స్ట్రక్చర్‌పై ఎమర్జెన్సీ వార్డుకు తీసుకెళ్తుతున్న బానోతు జానమ్మ

## రామప్పను సందర్శించిన విదేశీయులు

వెంకటాపూర్, ఏప్రిల్ 22 : మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని మంగళవారం ఫ్రాన్స్ దేశస్తుడు బ్రూనో, బెల్జియం దేశస్తుడు వేర్వేరుగా సందర్శించారు. ఆలయ శిల్పకళ ప్రాముఖ్యత, చరిత్రను టూరి జంగైడ్ ద్వారా తెలుసుకున్నారు. రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్‌గా ఉందని కొనియాడారు. అనంతరం రామప్ప చెరవును సందర్శించి బోటింగ్ చేశారు.



శిల్పాల విశిష్టతను ఫ్రాన్స్ దేశస్తుడు బ్రూనోకు వివరిస్తున్న గైడ్

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కృష్ణకాలనీ ఏప్రిల్ 22 : జిల్లా కేంద్రంలో ఈ నెల 27న నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై సాంబమూర్తి తెలిపారు. మంగళవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 12, 13 వార్డులైన కాశీంపల్లిలో మెగాజాబ్ మేళాపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఎస్సై హాజరై మాట్లాడారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో 80 కంపెనీల్లో 10వేల ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాలన్ని జిల్లాలోని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## విద్యుదాఘాతంతో బాలుడి మృతి

నెక్కొండ/గీసుగొండ, ఏప్రిల్ 22: ఆడుకుంటున్న బాలుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన నెక్కొండ మండలంలోని గేట్‌పల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గీసుకొండ మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన భూక్యా నరేశ్-నవ్య దంపతుల కుమారుడు శివశంకర్ వేసవి సెలవుల నేపథ్యంలో గేట్‌పల్లిలోని అతడి అమ్మమ్మ బదావత్ గోజీ ఇంటికి సోమవారం వచ్చాడు. మంగళవారం సాయంత్రం అమ్మమ్మ ఇంటి పక్కనే ఉన్న మరో ఇంటి స్లాబ్‌పైకి ఎక్కి ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో బాలుడికి విద్యుత్ తీగ తాకడంతో షాక్ కొట్టింది. వెంటనే చికిత్స కోసం నర్సంపేటలోని ప్రభుత్వ దవాఖానకు తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. శివశంకర్ దస్రూతండాలోని పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు.